క్లుప్తంగా

నేడు జగనన్న పెన్షన్ వారోత్సవాల సభ


కోన రామారావు

పరవాడ: స్థానిక సంతబయలు వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు జగనన్న పెన్షన్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలతో పాటు సొమ్ము అందజేస్తారని చెప్పారు. మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వారోత్సవాలను విజయవంతం చేయాలని కోన కోరారు.

చందనం సమర్పణకు రూ.50వేల విరాళం


దినేష్‌రాజ్‌కు రశీదు అందజేస్తున్న పీఆర్‌వో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందన సమర్పణ నిమిత్తం సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజు రూ. 50వేల విరాళం అందజేశారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో పీఆర్‌వో నాయుడు దేవస్థానం తరఫున నాయుడు రసీదు దినేష్‌రాజ్‌కు ఇచ్చారు.

చదువుల ప్రదాతపై విద్యార్థుల అభిమానం


ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు తాముగీసిన చిత్రాలు అందజేస్తున్న విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. సీఎం వైఎస్ జగన్ విగ్రహంతో పాటు విద్యార్థులు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చిత్రాలను గీశారు. వీటిని పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీకి హాజరైన ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కు విద్యార్థులు అందజేశారు. వీటిని అందుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విగ్రహాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దే ఆయనకే అందిస్తానని విద్యార్థి అభినవ్‌ను ప్రోత్సహించారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లిలో మంగళవారం కారులో తరలిస్తున్న ఏడు కిలోల గంజాయితో పాటు ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, పెందుర్తి పోలీసులు కలిసి పట్టుకున్నారు. పెందుర్తి సీఐ అప్పారావు తెలిపిన వివరాలు.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన సారిపల్లి దుర్గాప్రసాద్, విజయనగరానికి చెందిన తంగేటి భరత్ కారులో ఎస్. కోట నుంచి విశాఖకు గంజాయి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్, పెందుర్తి పోలీసులు సరిపల్లి దగ్గర కారు ఆపి తనిఖీ చేశారు. ఏడు కిలోల గంజాయితో పాటు కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా పట్టుబడిన ఇద్దరిపై పాత కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో లారస్ ల్యాబ్‌లో గత నెల 26న జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగి ఎడ్ల సతీష్ (36) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అదే రోజు నలుగురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సతీష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

ఊరూవాడ పింఛన్ల పండగ


పాపయ్యరాజుపాలెంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు


అప్పన్నపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎర్ర వరహానరసింహం, రామరాజు తదితరులు


97వ వార్డులో పింఛన్ అందజేస్తున్న మెంటి మహేష్


వృద్ధురాలికి జగనన్న పెన్షన్ గురించి వివరిస్తున్న జెడ్పీటీసీ సన్యాసిరాజు

సింహాచలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పాలన చేస్తున్నారని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం 502 సచివాలయం పరిధిలో మంగళవారం పింఛన్ పంపిణీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని, అధికారంలోకి రాగానే వారి కష్టాలు తీరుస్తున్నారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతిలేని పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. అవ్వాతాతల్లో ఆనందం నింపేందుకు పింఛన్ నగదు పెంచిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరూరి చినబాబు, రోమాల నూకరాజు, బొడ్డు నారాయణమూర్తి, అంగటి సూరిబాబు, జొన్నాడ సాయికృష్ణ, గోకివాడ బుజ్జి, బల్లంకి శివ, బొడ్డు ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 98వవార్డు అప్పన్నపాలెంలో పింఛన్ల పంపిణీని ఘనంగా నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో కలిసి వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లబ్ధిదారులకు పెరిగిన పింఛన్ నగదు రూ.2750 అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్ర వరహానరసింహం, పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు, కె.సింహాద్రి పాల్గొన్నారు.
- 97వ వార్డులోని 506 సచివాలయం పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.

పరవాడ: వైఎస్సార్ పెన్షన్ పెంపు వారోత్సవాలు మండలంలో పండగ వాతావరణంలో జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు పింఛన్ మంజూరు పత్రాలతో పాటు నగదు అందజేశారు. తానాం గ్రామంలో పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు లబ్ధిదారులకు జగనన్న పెంచిన రూ.2,750 పెన్షన్, నూతన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ గొరుపూటి శ్రీను, రమణ, సీనియర్ నాయకుడు డెక్క నూకరాజు పాల్గొన్నారు.

- వెన్నలపాలెంలో సర్పంచ్ వెన్నల అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం లబ్ధిదారులకు జగనన్న పింఛన్ పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు.

కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ వెన్నల సింహాద్రి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

- తిక్కవానిపాలెం గ్రామంలో సర్పంచ్ చేపల మసేను ఇంటింటికీ వెళ్లి అవ్వా తాతలు, దివ్యాంగులకు జగనన్న పెంచిన పింఛన్, మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.
- నాయుడుపాలెంలో రూ.2750 పింఛన్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూండ్రపు సీతారామయ్య లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు దాదానాయుడు, సత్యనారాయణ, వలంటీరు కూండ్రపు లక్ష్మి పాల్గొన్నారు.


వెన్నలపాలెంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు


తిక్కవానిపాలెంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ మసేను


ముత్యాలమ్మపాలెంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు సచివాలయ సిబ్బంది

22 మంది వలంటీర్లపై క్రమశిక్షణ చర్యలు

ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సచివాలయం పరిధిలో విధులకు గైర్హాజరైన 22 మంది వలంటీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. గ్రామంలో 27 మంది వలంటీర్లుగా పనిచేస్తున్నారు. వారిలో 11 మంది వలంటీర్ల పనితీరు సక్రమంగా లేదని అధికార పార్టీలో ఓ వర్గం ఎంపీడీవోకు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎంపీడీవో సక్రమంగా విధులు నిర్వర్తించని 11 మంది వలంటీర్లను గతేడాది డిసెంబర్ 22న విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ లోగా పింఛన్లు పంపిణీ చేయాల్సి వచ్చింది. పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అధికారులు డిసెంబరు 31న మిగిలిన 16 మంది వలంటీర్లకు ఆదేశాలు జారీ చేశారు. అయితే వారిలో ఐదు గురు వలంటీర్లు మాత్రమే ముందుకు వచ్చారు. మిగిలిన 11 మంది విధులకు హాజరు కాలేదు. చేసేది లేక సచివాలయ సిబ్బంది, విధులకు హాజరైన 5 గురు వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇంకా మిగిలిన లబ్ధిదారులకు బుధవారం పింఛన్లు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హేమసుందర్రావు చెప్పారు. విధులకు హాజరు కాని 22 మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

పరవాడ: ఈ.మర్రిపాలెం జీడి తోటల్లో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై పరవాడ సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ.600 స్వాధీనపర్చుకున్నారు. కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను బుధవారం కోర్టులో హాజరు పర్చనున్నట్టు సీఐ ఈశ్వరరావు చెప్పారు.

సింహగిరిపై నిత్యకల్యాణం పునరుద్ధరణ


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి నిత్యకల్యాణం పునరుద్ధరించారు. ఆలయంలో జరిగిన పగల్‌పత్తు ఉత్సవాలు, ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని గడిచిన పదిరోజులుగా నిత్యకల్యాణం రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం మళ్లీ నిత్యకల్యాణం జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఆదర్శమహిళ సావిత్రిబాయి పూలే


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామునాయుడు తదితరులు

సింహాచలం: మహిళా చైతన్యంతో పాటు వారి అభివృద్ధికి సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారని కైట్స్ కంప్యూటర్ విద్యా సంస్థల ఎండీ గొర్లె రామునాయుడు అన్నారు. పెందుర్తిలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి రామునాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం వందేళ్ల కిందటే పోరాడిన మహోన్నతురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ జిల్లా కన్వీనర్ నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయని పూలే కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఉష, మేరీ, లితాస్మి,రోహిణిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కె.శ్రీధర్, కైట్స్ సభ్యులు శుభాన్, రమేష్, మన్మథరావు, శిల్ప, పవిత్ర పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

పోటెత్తిన భక్తులు


వెంకటాద్రిపై ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు


సింహగిరిపై గోదాదేవికి హారతులు అందజేస్తున్న అర్చకుడు

సింహాచలం: పలు ఆలయాల్లో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు జరిపిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొంటున్నారు. సింహగిరిపై మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణ తదితర పూజల అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ పూజలు జరిపించారు.

వెంకన్న ఆలయంలో....

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై అధిష్టంపజేశారు. పాశుర విన్నపా పారాయణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

వెంకటాద్రిపై ..

పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరుప్పావై సేవా కాలం నిర్వహించి గోదాదేవికి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈపూజల్లో పాల్గొన్నారు.భక్తులందరినీ సామూహికంగా వేంజేపచేసి ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలను నిర్వహించారు.

విద్యార్థుల భవితకు బంగారు బాట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఆరిపాక పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


ఆరిపాకలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న అదీప్‌రాజ్

సబ్బవరం: ప్రతి విద్యార్థి ఉన్నత భవితకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఆయన 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు.

సంక్షేమం వివరించి.. సమస్యలు తెలుసుకుని

ఆరిపాక సచివాలయం పరిధిలోని ఆరిపాక,లగిశెట్టిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను గణాంకాల వారీగా ఇంటింటికీ వెళ్లి వివరించారు.వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఓటీఎస్ లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఆయన చేతులమీదుగా అందజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ఆరిపాక, లగిశెట్టిపాలెంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడులో భాగంగా రూ.46.53 లక్షల నిధులతో పాఠశాలలో చేపట్టిన నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఆరిపాకలో రూ.26.83 లక్షల తో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు కు , చినయాతపాలెంలో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఆరిపాకలో సుమారు రూ.10 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే లగిశెట్టిపాలెం కాలనీ నుంచి పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం వరకూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సర్పంచ్ పాలిశెట్టి పార్వతి,వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, నాయకులు పాలిశెట్టి సురేష్, బోకం రామునాయుడు,శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీఐ రంగనాథం తెలిపారు. సబ్బవరం కేజీబీవీలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల చట్టాలపై అవగాహన కోసం ప్రత్యేక వాహనం సిద్ధం చేసి డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం,గృహహింస,వరకట్న వేధింపులు,డ్రగ్స్,ర్యాగింగ్,చిన్నారులపై అఘాయిత్యాలు, గుడ్ టచ్,బ్యాడ్ టచ్, బాలికల అక్రమ రవాణా, ప్రేమ పేరుతో వేధింపులు,తదితర అంశాలకు సంబంధించి నేరాలకు పాల్పడితే చట్ట ప్రకారం విధించే శిక్షల గురించి తెలియజేసేలా వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌వో మృదుల, మిగిలిన పోలీస్ సిబ్బందితో పాటు బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నదియాకు అభినందనల వెల్లువ


శీలం నదియా, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్

పరవాడ: గ్రేటర్‌లో విలీనమైన తాడి, సాలాపువానిపాలెం ప్రాంత విద్యార్థుల సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టరు శీలం నదియాకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరులో ఉన్న సమస్యను పరిష్కరించారు.

ఇదీ పరిస్థితి

గతంలో పరవాడ మండంలో ఉన్న సాలాపువానిపాలెం, తాడి గ్రామాలను మూడేళ్ల కిందట అనకాపల్లి మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఫలితంగా అక్కడి విద్యార్థులు చదువులకు అవసరమైన కుల ఆదాయ ధ్రువపత్రాలు ఏ మండలం నుంచి మంజూరు చేయాలో తెలియక అనకాపల్లి, పరవాడ రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడేవారు. ఈ క్రమంలో సమస్యను ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ నదియా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులతో సంప్రదించి పరవాడ రెవెన్యూ కార్యాలయం నుంచి తాడి, సాలాపువానిపాలెం ప్రాంత విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంఎస్ఎంఈ డైరెక్టరు నదియాకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రావణికి సత్కారం


శ్రావణిని అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం వర్మ

సింహాచలం: ఇటీవల బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సదాశివుని శ్రావణి సిల్వర్ మెడల్ సాధించిందని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీఆర్‌ఆర్ వర్మ తెలిపారు. అండర్ 14–15 కేటగిరీలో శ్రావణి దేశం తరఫున పాల్గొని ఈఘనత సాధించిందన్నారు. మెడల్ సాధించిన శ్రావణిని మంగళవారం పాఠశాలలో వర్మ, పీడీలు వరహాలమ్మ, శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


నూకరాజు(ఫైల్)

సబ్బవరం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోచోటుచేసుకుంది. ఈఘనటపై సీఐ రంగనాథం మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెదుళ్లనరవకు చెందిన బసరబోయిన నూకరాజు(30)కు మండలంలోని అసకపల్లి శివారు సున్నంబట్టీలకు చెందిన మౌనికతో 2017 నవంబర్‌లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కాగా మౌనిక బ్యుటీషియన్‌గా పనిచేస్తుండగా,నూకరాజు ప్లంబింగ్‌తో పాటు ఇతర పనులు చేస్తుంటారు.అయితే నూకరాజుకు భార్య ప్రవర్తనపై అనుమానం ఉండడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో పాటు నూకరాజుకు అప్పులు కూడా ఉన్నాయి. ఇదిలా ఉండగా ఈ నెల 1వ తేదీన భార్యభర్తల మధ్యం వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో నూకరాజు ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు దేముడు సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి మంగళవారం తరలించినట్లు సీఐ తెలిపారు.

వెంకన్నగా దర్శనమిచ్చిన అప్పన్న


సింహగిరి మాడ వీధిల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న సిబ్బంది, అర్చకులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మంగళవారం వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెంకన్నగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.